

త్రివర్ణ అలంకారంలో త్రినేత్రుడు

బళ్లారి సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) బళ్లారి నగర ఆరాధ్యదేవుడు కోట మల్లేశ్వర స్వామిని శుక్రవారం త్రివర్ణపతాకంతో అలంకరించి పూజలు నిర్వహించారు. అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది . శ్రావణమాసం సందర్భంగా అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.



మాణెక్ షా పరేడ్ మైదానంలో రెపరెప లాడుతున్న త్రివర్ణ పతాకం

దేశానికే మార్గదర్శకం

- ప్రగతిపథంలో దూసుకెళ్తున్న కర్ణాటక
- ఐదు గ్యారెంటీలతో తలసరి ఆదాయం పెంపు
- కన్నడ నాయకుల త్యాగాలు ఎనలేనివి..
- ఉద్యోగాల సృష్టితో జీవన ప్రమాణంలో మార్పు
- స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): దేశానికి ప్రగతిలో కర్ణాటక మార్గదర్శకమని, అన్ని రంగాల్లోనూ రాష్ట్రం అదూసుకుపోతోందని రాజధాని బెంగళూరుతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉపాధి పెంపుకోసం పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం సిద్దరామయ్య అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మాణెక్ షా పరేడ్ మైదానంలో శుక్రవారం జాతీయపతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పోలీసులతోపాటు వివిధ ప్లటూన్‌లు, విద్యార్థుల బృందాలనుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ స్వాతంత్ర్య సముపార్జనకోసం ఎంతోమంది ప్రాణాలకు తెగించి పోరాటం చేశారని, వారిని మనం స్మరించుకోవడం అందరి కర్తవ్యం అన్నారు. మహాత్మా గాంధీ, వల్లభాయ్‌పటేల్, సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్ వంటి వారిని నిరంతరం స్మరించుకోవాలన్నారు. స్వాతంత్ర్యపోరాటంలో కర్ణాటక ముందంజలో ఉండేదన్నారు. కిత్తూరు రాణి చన్నమ్మ, సంగొళ్ళి రాయణ్ణ, ఘోండియా వాఘా, హళగళియ వీరబడేరు, మైలార మహదేవప్ప, బూది బసప్ప నాయక్‌ల వంటివారు ఉన్నారన్నారు. శ్రీరంగపట్టణ, సురపుర, విదురాశ్వత్థ, కిత్తూరు, ఈసూరు, శివపుర - అంకోలాలో బ్రిటీష్‌వారిని మనవారు గడగడలాడించారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అభివృద్ధి కోసం తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పునాది వేశారన్నారు. ఇటీవల పహల్గాంలో ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ మన ఆర్మీ చేసిన ఆపరేషన్ సిందూర కోసం సైనికులు సాహసించారన్నారు. చెప్పినట్లు పాటించాలని 12వ శతాబ్దంలోనే బసవణ్ణ సమసమాజం ప్రగతిదిశగా బాటలు వేశారన్నారు. దేశ ప్రముఖ సంస్థల సర్వే ప్రకారం 10శాతం శ్రీమంతుల వద్ద 80శాతం సంపద ఉందని, అయితే కేవలం 10శాతంలో 3శాతం జీఎస్టీ చెల్లిస్తున్నారన్నారు. దీనినిబట్టి దేశంలో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందినవారు ఎక్కువమంది ఉన్నారన్నారు. రాష్ట్రంలో 2023 కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు ఐదు గ్యారెంటీలను ప్రారంభించామని ఇప్పటివరకు రూ.96వేల కోట్లు లబ్ధిదారులకు ఇచ్చామన్నారు. 500 కోట్ల ట్రిప్పులు శక్తిగ్యారెంటీతో సాధ్యమైందన్నారు. శక్తిగ్యారెంటీ ఇచ్చామని, భద్రతకు వెనుకడుగు వేయలేదని 5049 కొత్త బస్సులు కొనుగోలు చేసి 8,473 మందికి ఆర్టీసీలలో ఉద్యోగాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం పెరిగిందన్నారు. 2013-14లో 1.01 లక్షలు కాగా ప్రస్తుతం 2.01 లక్షలకు చేరిందన్నారు. సామాజిక పెన్షన్‌లకు 1.12 లక్షలకోట్ల రూపాయలు చెల్లిస్తున్నామన్నారు. రాజకీయ ప్రభుత్వం కాకుండా సామాజిక ప్రజాప్రభుత్వం ముఖ్యమని భావించామన్నారు. ప్రజల స్థితిగతులను అర్థం చేసుకునేందుకే సామాజిక, విద్య సమీక్ష జరపాలని తీర్మానించామన్నారు. రెండేళ్లలో రాష్ట్ర అభివృద్ధికి గాను జాతీయస్థాయిలో 250కు పైగా పురస్కారాలు లభించాయన్నారు. అందులో న్యాయవ్యవస్థ, పోలీసు, శాంతిభద్రతల విషయంలో దేశంలోనే తొలిస్థానంలో ఉందన్నారు.



పతాకావిష్కరణలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్

పంటకు గిట్టుబాటు ధరతో రైతుకు న్యాయం

రాష్ట్రంలో ఉత్తమంగా వర్షాలు కురుస్తున్నాయని, అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీఎంసీలద్వారా ఎన్నో సంక్షేమాలు అమలు చేస్తున్నామన్నారు. రెండేళ్లుగా కుశించిన మామిడి, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించామన్నారు. వ్యవసాయరంగానికి ప్రస్తుత బడ్జెట్‌లో 51,339 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. రివార్డు పథకంతో 18 లక్షల హెక్టార్లలో భూవనరుల సమీక్ష చేశామన్నారు. ఆవునుంచి వినియోగదారుడి దాకా అనే నినాదంతో నందిని ఉత్పత్తుల్లో 175కుపైగా రకాలను మార్కెటింగ్ చేస్తున్నామన్నారు. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించే ఉద్దేశంతో 44,166 ఎకరాల్లో 18 పారిశ్రామిక ప్రదేశాలను అభివృద్ధి చేసి పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. 10 లక్షలకోట్లకుపైగా పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారన్నారు. విద్యారంగం బలోపేతానికి రూ.65వేల కోట్లు ఖర్చు చేయదలిచామన్నారు. రూ.2500 కోట్లతో 500 కర్ణాటక పబ్లిక్ స్కూళ్లను ప్రారంభిస్తున్నామని, 53లక్షలమందికి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీ ద్వారా విద్యావ్యవస్థలో మరిన్ని మార్పులకు కసరత్తు చేస్తున్నామన్నారు. యువతకు నైపుణ్యత కోసం నా వృత్తి - నా ఎంపిక అనే నినాదంతో 35వేలమంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

గిగ్ కార్మికుల సంక్షేమానికి కృషి

'అక్క' కెఫె ద్వారా హావేరి జిల్లాలో మంగళముఖిలకు ప్రోత్సహిస్తున్నామన్నారు. 5లక్షలమంది గిగ్ కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యాల నియంత్రణ, వేగవంతంగా న్యాయం కోసం 33 ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌లను ప్రారంభించామన్నారు. 17వేలమంది పౌరకార్మికులను ఇటీవలే రెగ్యులర్ చేశామన్నారు. నగరాభివృద్ధికి రూ.16,508 కోట్లు గ్రాంటు సమకూర్చామన్నారు. 10 మహానగర పాలికెలలో రూ.2వేల కోట్లతో రెండో విడత మహాత్మాగాంధీ నగర వికాస యోజన కొనసాగిస్తున్నామన్నారు. బెంగళూరు అభివృద్ధికి 1.35 లక్షలకోట్లతో డబుల్ డెక్కర్ రోడ్లు, సొరంగ మార్గాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో ఓ విద్యార్థి



కాంగ్రెస్ కార్యాలయంలో.. బీజేపీ కార్యాలయంలో..

ఆస్తుల డిజిటలైజేషన్‌తో సామాన్యులకు న్యాయం..

గ్రేటర్ బెంగళూరు పరిధిలో ఈ-ఖాతా వ్యవస్థను తీసుకొచ్చి డిజిటలైజ్ ఆస్తి వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 'బీ' ఖాతాను 'ఏ' ఖాతాగా మార్చుకునే వెసులుబాటు కల్పించామన్నారు. కేసీ వ్యాలీ ద్వారా కోలారు జిల్లాలో చెరువులు నింపే విధానం ఎంతో ప్రయోజనకరమైందన్నారు. జూన్ చివరినాటికి 3,87,756 మందికి వివిధ పథకాల ద్వారా శాశ్వతంగా ఇళ్లు నిర్మించామన్నారు. తీరప్రాంత జిల్లాల్లో రూ.200 కోట్లతో ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని, అక్కడ శాంతిభద్రతలు కల్పించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తిలో 12ఏళ్లలో నాలుగింతలు ప్రగతి సాధ్యమైందని, 24వేల మెగావాట్లకు చేరిందన్నారు. వైద్యం పేద, మధ్యతరగతి వర్గాలకు భారం కారాదనే రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రులలో సౌలభ్యాలను పెంచుతున్నామన్నారు. తల్లీబిడ్డల మరణాలు 26శాతానికి తగ్గిందన్నారు. ఇన్వెస్ట్ కర్ణాటక 2025 ద్వారా 3,250మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారని, 98 కంపెనీలతో 6.23 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడికి ఒప్పందాలు జరిగాయన్నారు. విదేశీ పెట్టుబడుల సాధనలో దేశంలోనే మూడోస్థానంలో ఉన్నామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, రైతులు, చేనేత కార్మికుల పిల్లలకు ఉన్నత విద్యకు సహకరిస్తున్నామన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ, ఏఐ, బయోటెక్ విభాగాలలో కర్ణాటక ముందంజలో ఉందన్నారు. కేవలం ఉద్యోగాలను సృష్టించడం లేదని, ప్రజల జీవనంలో మార్పులు తీసుకొచ్చే ఆవిష్కరణలు, కొత్తదనాన్ని సృష్టిస్తున్నామన్నారు. ప్రాంతీయ అసమానత తొలగాలనే అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మొబైల్ వీడండి, పుస్తకం చదవండి పేరిట చైతన్యం తెస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించామని, డ్రగ్స్ రహితంగా మార్చాలనేది ఆశయమని ప్రజలు సహకరించాలన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమానమైన హక్కులు అభివృద్ధి పంచాలన్నదే మా ఆశయమన్నారు.

పార్టీ కార్యాలయాల్లో..

నగరంలోని మూడు ప్రధాన రాజకీయ పార్టీల కార్యాలయాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన వేడుకలలో డీసీఎం డీకే శివకుమార్ పార్టీ అధ్యక్షుడి హోదాలో పతాకాన్ని ఆవిష్కరించారు. సీఎం సిద్దరామయ్య, సేవాదళ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇక బీజేపీ కార్యాలయంలో పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి పతాకాన్ని ఆవిష్కరించారు. మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, ఎంపీ పీసీ మోహన్, పార్టీ ప్రధాన కార్యదర్శి అశ్వత్థనారాయణ తదితరులు పాల్గొన్నారు. జేడీఎస్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు జరిపారు. ఎమ్మెల్సీ శరవణ, మాజీ ఎమ్మెల్సీ రమేశ్‌గౌడతోపాటు పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

జాతీయపతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్

రాజ్‌భవన్‌లో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయపతాకాన్ని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆవిష్కరించారు. రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సిబ్బందితోపాటు భద్రతా సిబ్బంది భాగస్వామ్యులయ్యారు. జాతీయపతాకాన్ని ఆవిష్కరించాక స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను గవర్నర్ వివరించారు. సాయంత్రం రాజ్‌భవన్‌లో తేనీటివిందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆహ్వానించారు. సీఎం సిద్దరామయ్యతోపాటు మంత్రులు, క్రీడాకారులు, పారా అథ్లెటిక్స్ బృందాలు, వీవీఐపీలు భాగస్వామ్యులయ్యారు.





సాంస్కృతిక ప్రదర్శనలు

ద్విభాషాసూత్రం అమలు చేయండి: కరవే

బెంగళూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లోనూ ద్విభాషా సూత్రాన్ని అమలు చేయాలని కర్ణాటక రక్షణా వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు నారాయణగౌడ పిలుపునిచ్చారు. రెండు రోజులుగా ఫ్రీడంపార్కులో నిరంతరంగా నిరసన కొనసాగించారు. వేలాదిమంది కన్నడ కార్యకర్తలు భాగస్వామ్యులయ్యారు. కరవే వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యానిపుణులు ప్రొఫెసర్ సుఖదేవ్ తోరట్ నేతృత్వంలోని కమిషన్ ద్విభాషా సూత్రాన్ని అమలు చేయాలని నివేదికలో పొందుపరిచారని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కన్నడ లేదా వారి మాతృభాష, రెండో భాషగా ఇంగ్లిష్‌ను నేర్చుకోవచ్చునన్నారు. మాతృభాష కన్నడనే ఎక్కువ మంది ఎంపిక చేసుకుందుకు వీలుంటుందన్నారు. ద్విభాష సూత్రంతో రెండు భాషలలోనూ సమగ్రమైన అవగాహన పొందేందుకు వీలుంటుందన్నారు. ఈమేరకు శుక్రవారం ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని సమర్పించారు.



సీఎం సిద్దరామయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కరవే బృందం

లాల్‌బాగ్‌లో సందడే సందడి



ప్రధాన ద్వారం వద్ద జనసందోహం

బెంగళూరు, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): లాల్‌బాగ్ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన పూల ప్రదర్శనను తిలకించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు తరలివచ్చారు. శుక్రవారం సెలవురోజు కావడంతో మరింత సందడి అనిపించింది. మరో రెండు రోజులు ఇదే తరహాలో సందర్శకులు ఉంటారని ఉద్యానవనశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నా కుమారుడిని అడ్వకేట్ చేస్తున్నా

- డీసీఎం డీకే శివకుమార్



బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్ర జ్యోతి): విద్యార్థి దశలో లా కోర్సు చేయాలని భావించానని కానీ చదువుకునేటప్పుడే పార్టీ టిక్కెట్ ఇచ్చిందని తన ఆశయం నెరవేర్చుకునేందుకు నా కుమారుడిని అడ్వకేట్ చేస్తున్నానని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. గురువారం కనకపురలో నూతనంగా నిర్మించిన కోర్టు కాంప్లెక్స్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తనకూ రోజూ నోటీసులు వస్తుంటాయని, కనీసం నువ్వైనా అడ్వకేట్ కావాలని కుమారుడిని కోరానన్నారు. బెంగళూరు దక్షిణ జిల్లా న్యాయవాదులకు ఎలాంటి సమస్య వచ్చినా సోదరుడిలాగా సహకరిస్తానన్నారు. కనకపురలో 240మంది అడ్వకేట్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నా అన్నారు. మా తాలూకాలో మీరు ప్రజాసేవ చేస్తున్నారని భావిస్తున్నా అన్నారు. 30ఏళ్లుగా ప్రజాప్రతినిధిగా కొనసాగుతున్నా అన్నారు. ఎవరైనా తమ మూలాలను మరవరాదన్నారు.

కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో మౌలిక వసతులు

- 177 గ్రామాల్లో ప్రత్యేక సదుపాయాలు
- రూ.100 కోట్లతో సీఎస్‌ఆర్ సంక్షేమాలు: ఎండీ సీఈఓ సత్యనారాయణరాజు

బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు 177 మారుమూల గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించదలిచామని కెనరాబ్యాంకు ఎండీ సీఈఓ కే సత్యనారాయణరాజు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కెనరాబ్యాంకు ప్రాంగణంలో జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎండీ సీఈఓ మాట్లాడుతూ కెనరాబ్యాంకు ఖాతాదారులందరికీ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గత ఏడాది దేశవ్యాప్తంగా 45వేలమంది ఎస్సీ, ఎస్టీ ప్రతిభావంత బాలికలకు ప్రోత్సాహకాలు ఇచ్చామన్నారు. ఈ ఏడాదికూడా 5-10 తరగతుల 45వేలమంది విద్యార్థినులకు ప్రతి విద్యార్థికి రూ.5వేలు చొప్పున 18 కోట్ల రూపాయలు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. దేశవ్యాప్తంగా కెనరాబ్యాంకు 177 రీజనల్ కార్యాలయాలు ఉన్నాయన్నారు. ప్రతి రీజినల్‌కేంద్రాల పరిధిలో ఒక మారుమూల గ్రామాన్ని ఎంపిక చేయాలని రీజనల్ మేనేజర్‌లకు సూచించామన్నారు. ప్రతి గ్రామానికి 10 లక్షల రూపాయల చొప్పున కేటాయించి తాగునీరు, మురుగు కాలువలు, పాఠశాలలో మౌలిక సదుపాయాలు, వైద్యపరమైన సేవలు అందించదలిచామన్నారు. ఇందుకు 17.70 కోట్ల రూపాయలు ఖర్చు కానుందని అంచనా వేశామన్నారు. 177 పాఠశాలల్లో బాలికలకోసం ప్రత్యేక టాయ్‌లెట్‌లను నిర్మించదలిచామన్నారు. ఇందుకుగాను 3.50 కోట్ల రూపాయలు ఖర్చు చేయదలిచామన్నారు. కెనరాబ్యాంకు సీఎస్‌ఆర్‌లో భాగంగా 3 స్కీమ్‌లకు వంద కోట్ల రూపాయలు ఖర్చు చేయదలిచినట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పరిధిలో 20 రీజియన్‌లు ఉన్నాయన్నారు. అక్కడ మారుమూల గ్రామాల ఎంపిక ప్రారంభమైందన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు మజుందార్, హరదీప్‌సింగ్ అహ్లువాలియా, భవేంద్రకుమార్‌లు పాల్గొన్నారు. బాలికలకు ప్రోత్సాహకాల చెక్కులను పంపిణీ చేశారు.



ప్రోత్సాహకాల చెక్కులు అందజేస్తున్న కెనరాబ్యాంకు ఎండీ సీఈఓ సత్యనారాయణరాజు

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్



రాయచూరు, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు అందాల్సిన రసాయన ఎరువులు, యూరియాను కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, రసాయనిక ఎరువులను దుర్వినియోగం చేయడం వంటి చర్యలకు పాల్పడితే బాధ్యుల పై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శరణు ప్రకాశ్ పాటిల్ హెచ్చరించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతనం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రసాయనిక ఎరువుల కొరత లేకుండా రైతులకు వారి అవసరాలకు తగుబడిన ఎరువులను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రసాయనిక ఎరువుల పంపిణీ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. తాము ఇప్పటికే రాష్ట్ర అవసరాలకు సరిపడ ఎరువులకు సంబంధించి ఇండెంట్ ఇచ్చామన్నారు. కేంద్రం ఎరువుల దిగుమతులో చూపుతున్న నిర్లక్ష్యం వల్లే ఈ కొరత ఏర్పడిందంటు మంత్రి ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రసాయనిక ఎరువుల ధరలు పెరిగిన నేపథ్యంలో కేంద్రంతో ఆర్థిక భారం పడుతుందన్న నెపంతోనే కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు మంత్రి ఆరోపించారు. కాగా జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచి వేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా మట్కా, జూదం, డ్రగ్స్ తదితర వాటిని పూర్తిగా నియంత్రించాలన్నారు. మంత్రి వర్గంలో తీసుకున్న నిర్ణయం మేరకే రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటు కోసం ఇప్పటికే కేంద్రాలనికి లేఖ రాశామన్నారు.


బళ్లారిలో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి రహీంఖాన్


త్రివర్ణ పతాకాన్ని అవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు


పతాకావిష్కరణలో హోస్పేట ఎమ్మెల్యే గవియప్ప

జిల్లాలో అభివృద్ధి పరుగులు

- రూ.150 కోట్లతో డెయిరీ
- తుంగభద్రకు క్రస్ట్‌గేట్లు
- అన్ని పనులు పూర్తి చేస్తాం
- స్వాతంత్ర్య వేడుకల్లో ఇన్‌చార్జి మంత్రి రహీంఖాన్

బళ్లారి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, అనుకున్న సమయానికి అన్ని పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మంత్రి రహీం ఖాన్ అన్నారు. ఎంతో మంది ప్రాణ త్యాగాల ఫలితమే మనకు స్వేచ్ఛ. స్వాతంత్ర్యం లభించాయన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా బళ్లారి విమ్స్ క్రీడా మైదానంలో మంత్రి త్రివర్ణ పతాకం ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం తర్వాత దేశంలో అనేక క్లిష్ట సమస్యలు పరిష్కరించుకుని దేశం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఆహార ఉత్పత్తి, పరిశ్రమ, వ్యవసాయం, అక్షరాస్యత, సాంకేతికత, ఆరోగ్యం, గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాలు, అంతరిక్ష శాస్త్రం, అణుశాస్త్రం. వంటి వాటిలో స్వావలంబన పొంది ప్రపంచం మన దేశం వైపు ఆకర్షించేలా చేశామన్నారు. రాజరికం అంతరించి, ప్రజాస్వామ్యం లభించడం అందరి అదృష్టమన్నారు. దేశ స్వతంత్ర్య పోరాటంలో బళ్లారి జిల్లా వాసుల పాత్ర కీలకంగా ఉందని అన్నారు. ప్రతి పౌరుడు దేశం కోసం ప్రాణాలు ఇచ్చేవిదంగా ముందుకు రావాలని కోరారు.


రెపరెపలాడుతున్న త్రివర్ణ పతాకం

- రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి అమృత నగరోత్తన్, మహాత్మాయగాంధీ నగర్ వికాస్ యోజన, స్వచ్ఛభారత్ మిషన్, అమృత 2.0 నగరాల అభివృద్ధికి సంబంధించిన 15వ ఆర్థిక ప్రణాళిక ద్వారా అనేక పురోగతి సాధించామన్నారు. మంత్రితో పాటు ఎంపీ ఇ. తుకారాం, బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, డాక్టర్ బాబు జగ్గీవన్‌రామ్, తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ ముండ్రిగి నాగరాజ్, మేయర్ ముల్లంగి నందీష్‌బాబు, డిప్యూటీ మేయర్ డి. సుకుమ్, బుడా అధ్యక్షుడు జే.ఎస్. అంజనేయులు, కే.ఇ చిదానంద, అధికారలు డి.సీ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణి, డీఐజీ వర్తిక కటియార్, వివిద ప్రభుత్వ శాఖల అధికారులు, కార్పొరేటర్లు, అధికారలు పాల్గొన్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా వివిద పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జిల్లా వ్యాప్తంగా..

బళ్లారి సిటీ/రూరల్/కంప్లి/సిరుగుప్ప/తోరణగల్లు/హోస్పేట/రాయచూరు (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ ఘనంగా చేపట్టారు. బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి జాతీయజెండాను ఎగురవేసి, జాతిపిత మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా గౌరవ కార్యదర్శి సురేశ్‌బాబు, వాణిజ్య పరిశ్రమల సంఘం మాజీ అధ్యక్షులు చెన్నప్ప, నాగేశ్, రమేశ్‌గోపాల్, సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు మహారుద్రగౌడ, మంజునాథ్, ఉపాధ్యక్షులు దొడ్డనగౌడ, సొంత గిరిధర్,రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

- రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ ధ్వజారోహణ గావించి దేశ నాయకులకు నివాళి అర్పించారు. ఈసందర్భంగా గౌరవాధ్యక్షుడు చన్నప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, రామాంజనేయులు, గాదెం గోపాలకృష్ణ, బసవరాజ,శేషారెడ్డి, శ్యామ్ సుందర్, శ్రీనివాసులు, వెంకటేశులు, శివశ్వేరగౌడ, భాస్కర్, రఘునాథ,రమణప్ప భజంత్రి తదితరులున్నారు.
- నగరంలోని కురుబ హాస్టల్లో కురుబ సంఘం నాయకులు మోహన్ తదితరులు పాల్గొని పతాకావిష్కరణ గావించారు.
- రూపనగుడి ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌డీఎంసీ రాజన్న 79వ స్వాతంత్ర్య ధ్వజారోహణ గావించి దేశ నాయకులను స్మరించుకున్నారు.
- హోస్పేట నగరంలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పునీత్ సర్కిల్‌సమీపంలోని ఎత్తైన జెండా స్తంభం వద్ద ఎమ్మెల్యే గవియప్ప అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జెండా ఆవిష్కరణ చేశారు.

త్యాగధనులను స్మరించుకుందాం : న్యాయాధికారి శాంతి

దేశ స్వేచ్ఛకోసం ఎందరో గొప్ప వ్యక్తులు తమ ప్రాణాలను త్యాగం చేశారు. వారిని స్మరించుకుని నివాళులర్పిద్దాం అని జిల్లాలీగల్ అథారిటీ చైర్మన్ న్యాయాధికారి జి.శాంతి అన్నారు. జిల్లా న్యాయవ్యస్థ,జిల్లా న్యాయసేవల ప్రాదికార సంస్థ, బళ్లారి జిల్లా బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాకోర్టు ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆమె జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఈకార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి జిల్లాలీగల్ సర్వీసెస్ కార్యదర్శి రాజేష్ హొసమనె, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రామబ్రహ్మ, కోర్టు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ బేరర్లు పాల్గొన్నారు.

శరవేగంగా రూ.2000 కోట్ల పనులు : మంత్రి

బళ్లారి జిల్లా అభివృద్ధిలో పరుగులు పెడుతోందని, అనేక పనులు ముమ్మరంగా సాగడమే దీనికి నిదర్శనమని మున్సిపల్ పరిపాలన , హజ్ మంత్రి రహీమ్ ఖాన్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్ళలో బళ్లారిజిల్లాలో వివిధ గ్రాంట్ల కింద సుమారు రూ.2,000 కోట్ల విలువైన పనులు జరగడం హర్షణీయమన్నారు. జిల్లాలో ఇప్పటికే రూ. 227కోట్లతో 247 తాగునీటి ప్రాజెక్టులు చేపట్టామన్నారు. బళ్లారిలో రూ. 135 కోట్ల కోట్ల వ్యయంతో అత్యాధునిక మెగా పాలడెయిరీ నిర్మిస్తున్నామన్నారు. కల్యాణ కర్ణాటకఅభివృద్ధికి రూ.5,000కోట్లు కేటాయించామన్నారు. 88వ అఖిల భారత కన్నడసాహిత్య సమ్మేళనం బళ్లారిలోనే నిర్వమిస్తామన్నారు. తుంగభద్ర క్రస్ట్ గేట్లను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు.


వాణిజ్య పరిశ్రమల మండలిలో పతాకావిష్కరణ


రాఘవ కళామందిరంలో..


కురుబ హాస్టల్లో..


రూపనగుడి ప్రభుత్వ పాఠశాలలో ..


తోరణగల్లులో పౌర కార్మికులకు దుస్తులు అందజేస్తున్న అధికారులు


త్రివర్ణ విద్యుత్ కాంతులతో రాతి రథం



సాంస్కృతిక కార్యక్రమాలు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు


కుడితిని పట్టణ పంచాయతీ కార్యాలయంలో..


కంప్లి పురసభలో అధ్యక్షుడు బట్టి ప్రసాద్



విద్యార్థుల ప్రదర్శన, విన్యాసాలు


బెస్ట్ కాలేజీలో..


కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, బోయపాటి విష్ణువర్ధన్


తిరుమల హైస్కూల్‌లో..


రాయచూరులో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి పాటిల్

సంగొళ్లి రాయన్నకు ఘన నివాళి


సంగొళ్లిరాయన్నకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ మిశ్రా

బళ్లారి సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగం,జిల్లాపంచాయితీ,కన్నడ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయ ఆవరణ హాల్లో క్రాంతి వీర సంగొళ్లిరాయన్న జయంతి వేడుకలు జరిగాయి. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా సంగిల్లి రాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిచారు. ఈకార్యక్రమంలో అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్ జుబేర్, కన్నడసంస్కృతికశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్ కేసులో ఐదుగురి అరెస్ట్

రాయచూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో కలకలం రేపిన నకిలీ ధ్రువపత్రాల కేసు నిందితులు శుక్రవారం పోలీసులకు పట్టుబడ్డారు. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి ఇళ్ల స్థలాలు, పొలాలు, కాజేసిన కేసులు ఐదు మంది నిందితులు జావీద్, అక్షయ భండారి, నీలకంఠ, ఆంజనేయ, ఉపేంద్రలను పోలీసులు అరెస్టు చేశారు. ఫిర్యాదు అందిన అనంతరం దాదాపు 45 రోజుల తర్వాత వీరిని అరెస్టు చేయడం విశేషం. నగరంలో పలు ఇళ్ల స్థలాలు, పలు గ్రామాల్లోని పొలాలను ఎంచుకున్న నిందితులు ముఠాగా ఏర్పడి నలికీ పత్రాలు సృష్టించి వాటి ద్వార విక్రయాలు జరిపినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. దీంతో పక్కా సమాచారం సేకరించిన పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరి వద్ద పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా ఇది జరిగిన వెను వెంటనే గుల్బర్గాలో ఎండీ జావీద్, సునితా బాయి అనే వ్యక్తులు రాయచూరులోని ఒక లేఔట్‌లో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి నివేశన స్థళాన్ని విక్రయించినట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. వీరి పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

కల్యాణకట్ట నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న విశ్వకర్మ నాయకులు రాఘవేంద్ర

కంప్లి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాళికాదేవి ఆలయ ప్రాంగణంలో విశ్వ కర్మ సముదాయ కళ్యాణకట్ట నిర్మాణానికి డి రాఘవేంద్ర భూమిపూజ చేపట్టారు. అనంతరం విశ్వకర్మ సమాజం అధ్యక్షులు డి రుద్రప్పచారి సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్క సమాజం కావాల్సిన మండపాలు ఏర్పాటు చేసుకుంటే సమావేశాలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. డి మౌనేష్ ఆచారి, చంద్రశేఖర్ ఆచారి, కళాచారి, రామచంద్ర, సత్యనారాయణాచారి, రాఘవేంద్ర, ఆనంద్, విజయ్‌కుమార్, వీరభద్రాచారి, నాగలింగాచారి, నీలకంఠాచారి, ప్రకాష్ సమాజ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

స్వాతంత్ర్య సంబరం


ఆదియమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో..

హోసూరు (కృష్ణగిరి), ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కృష్ణగిరితోపాటు జిల్లా వ్యాప్తంగా 79వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు శుక్రవారం సంబరంగా సాగాయి. జిల్లాకేంద్రంలో ఏర్పాటైన కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్ కుమార్ ముఖ్యులుగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల కవాతు ఆకట్టుకుంది. వివిధ విభాగాల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం వివిధరంగాలలో సాధకులను సత్కరించారు.


ప్రభుత్వ ఆర్‌వీ బాలుర ఉన్నత పాఠశాలలో..


గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్

హోసూరులో..

హోసూరు ఆర్‌వీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రధానోపాధ్యాయురాలు వలర్మతి ముఖ్యులుగా పాల్గొని జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. మేయర్ సత్య ప్రత్యేక అతిథిగా హాజరై హైటెక్ కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. జిల్లాస్థాయిలో పదోతరగతిలో మొదటిస్కోరు సాధించిన విద్యార్థికి తమిళనాడు ఫౌండేషన్ తరపున రూ.20వేలు చెక్కును అందచేశారు. పేరెంట్స్ టీచర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు సెందిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా ఆదియమాన్ ఇంజనీరింగ్ కళాశాల వేడుకలలో బయ ప్లస్ లైఫ్ లైఫ్ సైన్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ శివరామకృష్ణన్ ముత్తుస్వామి ప్రత్యేక అతిథిగా హాజరై పతాకాన్ని ఆవిష్కరించారు. వివిధ విభాగాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎంకే ఆధ్వర్యంలో జాగృతి ర్యాలీ

హోసూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): హోసూరులో పాటలి మక్కల్ పార్టీ (పీఎంకే) ఆధ్వర్యంలో హక్కుల పునరుద్ధరణకోసం జాగృతి కార్యక్రమం చేపట్టారు. నగరంలోని రామనగర్‌లోని అన్నా విగ్రహం వద్ద ఈనెల 18న ర్యాలీ బహిరంగసభ జరగనుంది. ఇందులో భాగంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలుసామి జెండా ఊపి జాగృతి వాహనానికి పచ్చజెండా చూపారు. పార్టీ నాయకులు అన్బుమణి రామదాస్ జూలై 25నుంచి జాగృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రచార వాహనానికి పచ్చజెండా చూపారు. పార్టీ జిల్లా కార్యదర్శి గోవిందరాజ్, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి వేలుచామి, మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ ముకద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


జాగృతి వాహనానికి పచ్చజెండా ఊపుతున్న కార్యదర్శి వేలు

బెళగావిలో చర్మచికిత్సాకేంద్రాలపై దాడి

- 10 సెంటర్‌లు సీజ్

బెంగళూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రమైన బెళగావిలో అనధికార స్కిన్ హెయిర్‌ఫాల్ చికిత్సా కేంద్రాలపై వైద్యశాఖ, రెవెన్యూ అధికారులు శుక్రవారం దాడులు జరిపారు. అనుమతులు లేకుండా కొనసాగుతున్న పది కేంద్రాలను సీజ్ చేశారు. మరో ఏడు కేంద్రాలకు నోటీసులు జారీ చేశారు. జిల్లా అధికారి మహ్మద్‌రోషన్ తెలిపిన మేరకు ఇటీవల ప్లాస్మా థెరపీ హెయిర్‌ప్లాంట్ పేరిట మోసం చేస్తున్నారని డెర్మటాలజీ అసోసియేషన్ ఫిర్యాదు చేసిందన్నారు. ఈమేరకు దాడులు జరపాలని ఆదేశించినట్టు తెలిపారు. 30 చోట్ల దాడులు కొనసాగాయన్నారు. లేజర్ చికిత్స, సర్జరీ, హెయిర్‌ప్లాంట్, ప్లాస్మా థెరపీ పేరిట మోసాలకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. చట్టవ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా తగిన చర్యలు తప్పవన్నారు. ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే ఎలాంటి చర్యలకైనా వెనుకాడమన్నారు.

మహిళ ఆత్మహత్య


చైత్ర(ఫైల్)

బళ్లారి సిటీ,ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మోకాపోలీస్ స్టేషన్‌కు చెందిన పీఎస్ఐ కళింగ భార్య చైత్ర(34) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. తమ క్వార్టర్‌లోని ఇంటిపైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై అదే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆమె మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. బీఎంసీ ఆర్‌సీ మార్చురీలో పోస్ట్ మార్టం నిర్వహించారు. ఎస్పీ శోబారాణి, రవికుమార్ తదితరులు పరిశీలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కళింగ ఇదే స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్నారు. స్టేషన్‌లో జెండాను ఎగురవేసిన తర్వాత అల్పాహారం తీసుకురావడానికి ఆయన ఇంటికి వెళ్లారు. అప్పుటికే చైత్ర తన ఇంటి పైకప్పుకుఉరి వేసుకుని మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

మృతదేహం లభ్యం

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా హరపనహళ్ళి తాలూకా అరిసీకెర కంచికెర సమీపంలో అటవీ ప్రాంతంలో బాళప్పన మట్టి ప్రదేశంలో సగం కాలిన స్థితిలో మహిళ మృతదేహాన్ని గురువారం పోలీసులు గుర్తించారు. పోలీసులు ప్రాథమిక సమాచారం మేరకు మహిళను అత్యాచారం చేసి హత్య చేసినట్లు, ఆధారాలు లభించకుండా శవాన్ని కాల్చివేసే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయితే మృతదేహం సగం కాలి అలాగే ఉండిపోయింది. మహిళను మాజిహళ్ళి తండాకు చెందిన ఆర్.అశ్విని బాయి(22)గా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాల మేరకు గురువారం ఉదయం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా స్థాయి పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు హరపనహళ్ళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్లకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం పంపిణీ చేస్తున్న సమాజ సేవకుడు వస్కోటి జగదీష్

కంప్లి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బళ్లారి బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు సమాజ సేవకుడు మెట్రి హొసకోటి జగదీష్ యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రోడ్డు నియమాలు తప్పనిసరిగా పాటించి ప్రయాణం కొనసాగించాలని ఎంతోమంది ప్రయాణికుల జీవితాలు వారిపై ఆధారపడి ఉన్నాయన్నారు. అలాగే ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్, ఆటో ఇన్సురెన్స్ తప్పనిసరిగా తమ వద్ద వుంచు కోవాలన్నారు. తమ పిల్లలకు విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర గౌడ నారాయణప్ప, సిద్ధప్ప, శంకరప్ప, బలే మల్లికార్జున, రాజా గంగాధర్ తిమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

కృష్ణాష్టమి




హిందూ ఇతిహాసాల ప్రకారం శ్రీమహావిష్ణువు ఎనిమిదో అవతారమైన శ్రీకృష్ణుడు జన్మదినాన్ని కృష్ణాష్టమిగా పిలుస్తారు. కృష్ణ జన్మాష్టమి, గోకులాష్టమిగా వ్యవహరిస్తారు. భక్తులు పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం శ్రీకృష్ణుడిని పూజిస్తారు. శ్రావణ మాసంలో లభించే పళ్లు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడను స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారు. పుర వీధులలో ఎత్తుగా ఉట్లు కట్టి పోటీ పడి వాటిని కొడతారు. ఉట్ల పండుగగా ఉట్ల తిరునాళ్లగా పిలుస్తారు.

వానమామలై వరదాచార్యులు (జయంతి)



బహుభాషా పండితులు, ప్రముఖ పండితుడు, రచయిత వానమామలై వరదాచార్యులు 1912 ఆగస్టు 16న వరంగల్ జిల్లా మండికొండలో జన్మించారు. 13వ యేటనే పద్యరచన ప్రారంభించి 64కు పైగా రచనలు చేశారు. ఆయన రచనలలో 'మణిమాల' ఎంతో పేరొందింది. ఉపాధ్యాయుడిగా, ఎమ్మెల్సీగా వ్యవహరించారు. పోతన జీవితమే ఆదర్శంగా సాగి 'అభినవ పోతన'గా గుర్తింపు పొందారు. బెనారస్‌లోని సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. ఆంధ్ర ఉత్ప్రేక్ష చక్రవర్తి, మహాకవి శిరోమణి బిరుదులు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారాలు అందుకున్నారు. 1984 అక్టోబరు 31న కన్నుమూశారు.

రామకృష్ణ పరమహంస (వర్ధంతి)



ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రామకృష్ణ పరమహంస 1836 ఫిబ్రవరి 18న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హుగ్లీ జిల్లా కామార్పుకూర్‌లో జన్మించారు. అసలుపేరు గదాధర్ ఛటోపాధ్యాయ. 19, 20వ శతాబ్దాలలో పశ్చిమబెంగాల్‌లో ఆధ్యాత్మిక విప్లవం తెచ్చారు. కాళికాదేవి భక్తుడు. రామకృష్ణ మఠం, మిషన్‌ను స్థాపించి దేశవ్యాప్తంగా ప్రజలలో విద్య, సామాజిక, ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు కృషి చేశారు. సమాజంలో పేరుకున్న మూఢనమ్మకాలను తొలగేందుకు పాటుపడ్డారు. కాగా స్వామి వివేకానంద ఆయన ప్రధాన శిష్యులు. 1886 ఆగస్టు 16న పరమపదించారు.

అటల్ బిహారీ వాజ్‌పేయ్ (వర్ధంతి)



భారతరత్న గ్రహీత, దేశం గర్వించదగిన నాయకులలో అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఒకరు. బీజేపీ నుంచి దేశ ప్రధానిగా వ్యవహరించి అజాతశత్రువుగా పేరొందారు. 1924 డిసెంబరు 25న మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జన్మించారు. కవిగా, రచయితగా రాణించారు. కాంగ్రెస్సేతర తొలి ప్రధాని ఆయనే. అంతేకాక మూడుసార్లు ఆ హోదాలో కొనసాగడం మరింత విశేషం. దేశ అత్యున్నత 'భారత రత్న', పద్మ విభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. నాలుగు దశాబ్దాలపాటు వివిధ హోదాలలో కొనసాగి 1994లో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారు. అంతేకాక ఆయన పుట్టినరోజును గుడ్ గవర్నెన్స్ డేగా ప్రకటించారు. 2018 ఆగస్టు 16న కన్నుమూశారు.

అరవింద్ కేజ్రీవాల్ (పుట్టినరోజు)



ఢిల్లీ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన అరవింద్ కేజ్రీవాల్ 1968 ఆగస్టు 16న హర్యానాలో జన్మించారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. రాజకీయాలలోకి రాక మునుపు ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌లో చేరి జాయింట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్‌గా వ్యవహరించారు. ఆయన నాయకత్వాన్ని గుర్తించి 'రామన్ మెగసెసె పురస్కారం' అందుకున్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ పట్టా పొందారు. పలు గౌరవాలు, పురస్కారాలు అందుకున్నారు. 2014లో టైమ్స్ జాబితాలో 100 లోపు టాప్‌మోస్ట్ ప్రభావిత వ్యక్తులలో ఒకరుగా నిలిచారు.

సైఫ్ అలీఖాన్ (పుట్టినరోజు)



పద్మశ్రీ పురస్కార గ్రహీత ప్రముఖ హిందీ నటుడు సైఫ్ అలీఖాన్ 1970 ఆగస్టు 16న న్యూఢిల్లీలో జన్మించారు. క్రికెట్ మాజీ కేప్టెన్ మన్సూర్ అలీఖాన్ పటౌడి కుమారుడు. నటుడిగానే కాక నిర్మాతగా రాణించారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. నేషనల్ ఫిల్మ్ అవార్డు, 6 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు ఇతర అవార్డులు అందుకున్నారు. స్టేజ్ షో పర్‌ఫార్మర్‌గాను, బుల్లితెరపైనా తన సత్తా చాటుకున్నారు.

రూ.200 కోసం దారుణ హత్య

బెంగళూరు, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసులో యావజ్జీవ కారాగారశిక్షను అనుభవించి జైలు నుంచి విడుదలైన వ్యక్తి కేవలం 200 రూపాయల కూలి డబ్బులకోసం తోటి కూలీని దారుణంగా హతమార్చిన సంఘటన ఉత్తరకన్నడ జిల్లా శిరసి తాలూకాలో చోటు చేసుకుంది. కమటగేరిలో గురువారం రాత్రి 8.30 గంటలకు కమటగేరి వాజిరాజమఠం సమీపంలో రవీశ్ గణపతి చన్నయ్య, మంజునాథ బసయ్య చన్నయ్యల మధ్య గొడవ జరిగింది. రవీశ్ 500 రూపాయలు మంజునాథకు ఇవ్వాల్సి ఉండేది. అందులో రూ.300 ఇచ్చాడు. రూ.200 కోసం ఇద్దరి మధ్యా వాగ్వాదం చోటు చేసుకుంది. మద్యం మత్తులో రవీశ్ (35)పై గడ్డపారతో తలపై కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు మంజునాథను


శుక్రవారం ఉదయం శిరసి గ్రామీణ పోలీసులు అరెస్టు చేశారు. మంజునాథ 2002 లో భార్య తండ్రి (మామ)ను హత్య చేసిన మేరకు యావజ్జీవ కారాగారశిక్షకు గురయ్యాడు. 2016 నాటికి శిక్ష ముగియడంతో జైలునుంచి బయటకు వచ్చి రవీశ్ తో కలసి కూలి పనులు చేసేవాడు. మద్యం మత్తులో తరచూ గొడవ చేసేవాడని రవీశ్ కుటుంబ సభ్యులు తెలిపారు. శిరసి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. జిల్లా అడిషినల్ ఎస్పీ కృష్ణమూర్తి, డీఎస్పీ గీతాపాటిల్ ఘటనా స్థలాన్ని సందర్శించారు.



సర్జాపురలో స్వాతంత్ర్య వేడుకలు



దొడ్డబళ్ళాపురలో వివిధ రంగాల సాధకులకు సన్మానం



కేఆర్‌పురలో ప్రతిభావంత విద్యార్థిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే

వాడవాడలా రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు సహా రాష్ట్ర వ్యాప్తంగా త్రివర్ణపతాకం రెపరెపలాడింది. పాఠశాలలు, కళాశాలలు, పంచాయతీ కార్యాలయాలు తదితర కీలక ప్రదేశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సాగాయి.

సర్జాపురలో...

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకా సర్జపుర గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు డాక్టర్ కళావతి మూర్తికుమార్ జాతీయజెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రీడామైదానంలో పంచాయతీ ఉపాధ్యక్షుడు ఎస్ మంజునాథ్‌సర్జా జెండాను ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డబళ్ళాపురలో...

దొడ్డబళ్ళాపుర: దేశం ఆర్థికప్రగతిలో ప్రపంచంలో ఐదో స్థానంలో ఉందని ఉపవిభాగాధికారి దుర్గాశ్రీ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని భగత్‌సింగ్ క్రీడామైదానంలో జాతీయపతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్‌వారిపై ఎంతోమంది పోరాటం చేశారని, మహనీయుల ఆదర్శాలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ మాట్లాడుతూ దశాబ్దాల పోరాటం ఫలితంగా స్వాతంత్ర్యం లభించిందన్నారు. వారి సత్యాగ్రహం, కారాగృహజీవనం, బలిదానాల ప్రతిఫలాన్ని విస్మరించ రాదన్నారు. కాగా పట్టణంలో స్వచ్ఛత, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు పథ సంచలనం, గౌరవవందనం స్వీకరించారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఇదే సందర్భంగా వివిధరంగాల సాధకులను సత్కరించారు. తహసీల్దార్ విభా విద్యారాథోడ్, బీఈఓ శంకరయ్య, సీఐ అమరేశ్‌గౌడ, నగరసభ కమిషనర్ కార్తీకేశ్వర్, నరగసభ అధ్యక్షురాలు సుమిత్రి తదితరులు పాల్గొన్నారు.

కేఆర్ పురలో....

మహదేవపుర: తాలూకా జాతీయ పండుగల ఆచరణ సమితి, తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో కేఆర్‌పుర ప్రభుత్వ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవం జరిగింది. ఎమ్మెల్యే బైరతి బసవరాజ్, తహసీల్దార్ రాజీవ్, బీఈఓ గోవిందప్ప, ఈఓ వసంతకుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠాలకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక రంగాలలోనూ ప్రతిభ చాటుకోవాలని సూచించారు. ఇదే సందర్భంగా ప్రతిభావంత విద్యార్థులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి.

శిడ్లఘట్టలో..

శిడ్లఘట్ట: తాలూకా కార్యనిరత పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. సంఘం అధ్యక్షుడు వీరాపుర మంజునాథ్ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం కోసం పాటుపడిన మహనీయుల త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చాయ రమేశ్, కోశాధికారి తమీమ్‌పాషా, సీనియర్ పాత్రికేయులు కేవీ మునేగౌడ, కే నాగరాజు, కరగప్ప తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహళ్ళిలో...

బొమ్మనహళ్ళి: 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలు సాగాయి. హెచ్ఎస్ఆర్ లే అవుట్, సోమసుందరపాళ్య, మంగమ్మనపాళ్య పరంగిపాళ్య ప్రాంతాలలో వేడుకలు జరిగాయి. హెచ్ఎస్ఆర్ వాజ్‌పేయ్ క్రీడామైదానంలో బీబీఎంపీ ఆధ్వర్యంలో ఏర్పాటైన వేడుకలలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు. బెంగళూరు నగరంలో రెండో అతి ఎత్తైన స్తంభంపై జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర విభాగాల నుంచి గౌరవవందనం స్వీకరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్ఫూర్తిగా తీసుకుని దేశ రక్షణకోసం నేటి యువత సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ ఆర్మీ సేవలను కొనియాడారు. బీజేపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, రెడ్డిజనసంఘం డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి, బీబీఎంపీ జాయింట్ కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎస్‌వీఆర్ చిన్మయ విద్యామందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యాసంస్థల అధినేత కే వాసుదేవరెడ్డి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మెరిట్ విద్యార్థులకు జ్ఞాపికలు అందచేశారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని, విద్యలో రాణించడంతో పాటు దేశసేవలో మమేకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజ్వల్, రంజిత్, ప్రిన్సిపాల్ మిత్ర తదితరులు పాల్గొన్నారు. కాగా సోమసుందరపాళ్యలోని ప్రభుత్వ పాఠశాలలోనూ పతాకావిష్కరణ చేసి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కాగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సాగాయి.



విజయనగరలో పతాకావిష్కరణలో ఎమ్మెల్యే కృష్ణప్ప



శిడ్లఘట్టలో పతాకావిష్కరణ



చిక్కబళ్లాపురలో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి



విజయపురలో ఐటీబీపీ దళం



ముళబాగిలులో స్వాతంత్ర్య వేడుకలు



గౌరవవందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి



విద్యార్థులకు మెడల్స్‌తో అభినందన



విజయపుర పురసభ ఆధ్వర్యంలో..

బీఎస్ఎఫ్ బెటాలియన్‌లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



బీఎస్ఎఫ్ బెటాలియన్‌లో పాల్గొన్న సైనికులు



విద్యాలక్ష్మి పాఠశాలలో..



వివేకనగర్ తెలుగు పాఠశాలలో..

బెంగళూరు, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీఎస్ఎఫ్ బెటాలియన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న సైనికులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైనికులు విన్యాసాలు చేశారు. వివిధ క్రీడలలో రాణించినవారికి షీల్డులు బహూకరించారు. చిన్నారుల నృత్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

వివేక్‌నగర్ తెలుగు పాఠశాలలో..

వివేక్‌నగర్‌లోని తెలుగు హైస్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సంబరంగా జరిగాయి. సేవాభారత్ ట్రస్టు ప్రతినిధి సురేంద్రరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయపతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు దేశభక్తి గేయాలు ఆలపించి నృత్యాలు చేశారు. ట్రస్టు తరఫున గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వరుణ్‌సందేశ్‌కు రూ.3వేలు, శాలిని, చందనాలకు రూ.2వేలు చొప్పున ప్రోత్సాహకాలు అందించారు. రిటైర్డు టీచర్ రంగస్వామినాయుడు, జగన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ విద్యాసంస్థలో...

నగరంలోని శ్రీకృష్ణ గ్రూప్ విద్యాసంస్థలో ఇస్రో మాజీ డిప్యూటి డైరెక్టర్ జీఎంవీ ప్రసాద్ పతాకావిష్కరణ చేశారు. విద్యాసంస్థ చైర్మన్ ఎం రుక్మాంగద నాయుడు విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.



శ్రీకృష్ణ విద్యాసంస్థలో చిన్నారుల ప్రదర్శన

విద్యాలక్ష్మి పబ్లిక్ స్కూల్‌లో...

నగరంలోని అంజనానగర్‌లో గల విద్యాలక్ష్మి ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. సంస్థ వ్యవస్థాపకులు మంగళ సిద్ధలింగయ్య జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ సిద్ధలింగయ్య, చైర్మన్ జయరామయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థాపకురాలు మాట్లాడుతూ.. విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవాన ఒక మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. నైతిక విలువలు పాటించేలా ఎదగాలన్నారు. ఇదే సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

కేఆర్ పురంలో క్రైం ఫ్రీ మారథాన్



మారథాన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

బెంగళూరు, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): కేఆర్‌పురం శాసనసభ నియోజకవర్గ పరిధిలో క్రైం ఫ్రీ మారథాన్ శుక్రవారం ఉత్సాహంగా సాగింది. కేంబ్రిడ్జ్ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్, కేపీసీసీ జనరల్ సెక్రటరీ డీకే మోహన్ ఆధ్వర్యంలో మారథాన్ జరిగింది. హొస్కోటె ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ, మాజీ ఎంపీ రాజీవ్‌గౌడలతో కలసి డీకే మోహన్ జెండా ఊపి మారథాన్ ప్రారంభించారు. 15వేలమందికిపైగా పాల్గొన్నారు. 5కే, 8కే విభాగాలలో మారథాన్ సాగింది. నేర రహిత కేఆర్‌పురం కోసం భారీస్థాయిలో స్పందన వచ్చిందని డీకే మోహన్ తెలిపారు. సమాజంలో శాంతిభద్రతలు, ప్రశాంత వాతావరణం కల్పించాలంటే అందరి భాగస్వామ్యం ముఖ్యమని అందుకే మారథాన్ ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకొచ్చామన్నారు. మారథాన్‌కు స్థానికులనుంచి ప్రత్యేక ఆదరణ లభించిందని కొనియాడారు. అంతకుముందు స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు.



త్రివర్ణ పతాకావిష్కరణ

వైద్యసేవలు మరింత సరళీకృతం కావాలి



మంత్రి ఎంబీ పాటిల్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు అన్ని రంగాలలో ప్రపంచస్థాయిలో అభివృద్ధి చెందుతోందని వైద్యసేవలలోనూ అదేస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా ఆసుపత్రుల ఏర్పాటు సంతోషకరమని రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ అభిప్రాయపడ్డారు. సక్ర ఐకేఓసీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లో ప్రారంభించారు. సక్ర ఎండీ యూయిచి నాగానో, వైస్ ఎండీ ఇయామా, సీఈఓ లవకేశ్‌కుమార్, ఇంటర్నేషనల్ నీ ఆర్థో సెంటర్ (ఐకేఓసీ) ఫౌండర్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్యంలో పరస్పర సహకారంతో సేవల గుణాత్మకత పెంచదలిచామని, ప్రతిరోగికి కేవలం చికిత్స కాకుండా సంపూర్ణంగా కోలుకునేవరకు సేవలు కొనసాగిస్తామన్నారు.

శరణ బసవప్పకు అంతిమ నివాళి



శరణబసవప్ప (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కలబురగిలోని శరణ బసవేశ్వర సంస్థానం ఎనిమిదో పీఠాధిపతి, శరణ బసవేశ్వర యూనివర్సిటీ చాన్స్‌లర్ శరణ బసవప్ప (90)కు అంతిమ నివాళులు అర్పించారు. అప్పగా పేరొందిన ఆయన గురువారం రాత్రి వయోభారం ఆరోగ్యం సమస్యలతో తుదిశ్వాస వీడారు. అప్పకు భార్య దాక్షాయణి, కుమారుడు, సంస్థానం తొమ్మిదో పీఠాధిపతి దొడ్డప్ప అప్పతోపాటు 8మంది కుమార్తెలు ఉన్నారు. ఆధ్యాత్మికంగా, విద్యాపరంగా అప్ప ఎనలేని సేవలు చేశారు. శరణ బసవేశ్వర యూనివర్సిటీ, రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్, అప్ప పబ్లిక్ స్కూల్, గోదు తాయి మహిళా కాలేజ్, ఇంజనీరింగ్స్ ఆర్ట్స్ సైన్స్ కామర్స్ కళాశాలలు ఉన్నాయి. ధారవాడ విశ్వవిద్యాలయం నుంచి తత్వశాస్త్రంలో పీహెచ్‌డీ పొందారు. అదే యూనివర్సిటీకి సిండికేట్ మెంబర్‌గా కొంతకాలం వ్యవహరించారు. అప్ప మృతి పట్ల సీఎం సిద్దరామయ్య, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సంతాపం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. కాగా డీసీఎం డీకే శివకుమార్, మంత్రి ప్రియాంకఖర్గే తదితరులు పాల్గొన్నారు.

వివాహితను హతమార్చి ఆపై ఆత్మహత్య

బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా ఖానపుర తాలూకా బీడీ గ్రామంలో వివాహితను చాకుతో పొడిచి హతమార్చి ఆపై అదే చాకుతో పొడుచుకుని ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఉదంతం చోటు చేసుకుంది. బీడీ గ్రామానికి చెందిన ఆనంద్‌రాజు సుతార (30) అదే గ్రామానికి చెందిన 28 ఏళ్ల వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. రెండేళ్లుగా వీరి మధ్య సంబంధం ఉన్నట్టు తెలుస్తోంది. విషయం తెలియడంతో మహిళ భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇటీవలే పోలీసులు ఆనంద్‌ను స్టేషన్‌కు రప్పించి మరోసారి వివాహితతో సంబంధం కొనసాగించరాదని హెచ్చరించారు. గురువారం రాత్రి వివాహిత భర్త డెయిరీలో పాలు వేసేందుకు వెళ్లాడు. అంతలోనే వెనుక డోర్‌నుంచి ఇంట్లోకి ప్రవేశించిన ఆనంద్, ఆమె గొంతు, ఛాతీతోపాటు పలుచోట్ల బలంగా చాకుతో పొడిచాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అదేచాకుతో ఆనంద్ పొడుచుకున్నాడు. తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరడంతో స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు.

కాగా ఆనంద్‌కు ముగ్గురు పిల్లలు కాగా ప్రస్తుతం భార్య గర్భవతిగా ఉన్నారు. మృతి చెందిన మహిళకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. నందఘడ్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. స్థానికంగా ఈ ఘటన కలచివేసింది. ఇరు కుటుంబాలలో విషాదం నెలకొంది.